ఘనంగా పూలే జయంతి 2





అంబులెన్సును ఢీకొన్న ప్రైవేటు బస్సు 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

11-4-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## రెండు వారాల్లో 338 డ్రంకన్ డ్రైవ్ కేసులు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన రెండు వారాల్లో డ్రంకన్ డ్రైవ్ కేసులు 338 నమోదు నమోదయ్యాయని, రూ.25 లక్షలకు పైగా జరిమానాలు విధించబడ్డాయని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, అన్ని పీఎస్‌లలో గడిచిన రెండు వారాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా 338 మంది పట్టుబడగా వారిని నిజామాబాద్, బోధన్ ఆర్మూర్ కోర్టుల్లో హాజరుపర్చినట్లు వివరించారు. ఇందులో 34 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని, మిగిలిన వారికి ఆయా కోర్టులు రూ.25,75,000 జరిమానా విధించినట్లు తెలిపారు.



## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి: సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీపీ సాయిచైతన్య సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నగరంలోని జీజీహెచ్‌లో అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ గదిని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సీపీ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలని, ఒకవేళ డ్రగ్స్‌కు తీసుకుంటే జీజీహెచ్ లో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ సెంటర్‌లో చికిత్స తీసుకోవాలని సూచించారు. అలాగే జీజీహెచ్‌లో భద్రతపై సీపీ సాయిచైతన్య సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఆస్పత్రిలో పార్కింగ్, సీసీ కెమెరాల పనితీరు, చిన్నారుల అపహరణ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, శ్రీలత, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ నాగమోహన్, నోడల్ ఆఫీసర్ రాజేందర్, సైకియాట్రిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.




## డ్రగ్స్ రహిత సమాజం కోసం డీఅడిక్షన్ సెంటర్: ఎస్పీ రాజేష్ చంద్ర

**అక్షరటుడే, కామారెడ్డి:** డ్రగ్స్ రహిత సమాజం కోసమే జిల్లా ఆస్పత్రుల్లో ప్రభుత్వం డీ అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా శనివారం కామారెడ్డి జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం, ఇతర మత్తుపదార్థాలకు బానిసలైన వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి, వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందన్నారు. భవిష్యత్ తరాలకు డ్రగ్స్ లేని స్వచ్ఛమైన సమాజాన్ని అందించడమే ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మత్తులో వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో భద్రత కరువవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ యాదగిరి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవీందర్ గౌడ్, సైకియాట్రిస్ట్ డాక్టర్ వివేక్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల సువిశాల స్థలంలో రూ.200 కోట్ల వ్యయంతో పాఠశాలల నిర్మాణానికి నిర్ణయించింది. కామారెడ్డి జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా కేవలం మూడు నియోజకవర్గాలకు మాత్రమే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరయ్యాయి. కామారెడ్డి నియోజకవర్గానికి పాఠశాల మంజూరు కాకపోవడం పట్ల అనేక విమర్శలు వస్తున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

# యంగ్ ఇండియా స్కూల్ వచ్చేనా!

- కామారెడ్డికి మంజూరు కాని పాఠశాల
- ప్రతిపాదనలు పంపించలేదనే ఆరోపణలు

కామారెడ్డి నియోజకవర్గంలో ఇద్దరు ముఖ్య నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో ఇద్దరు నాయకులు అభివృద్ధిని పక్కన పెట్టి వ్యక్తిగత రాజకీయాలు చేస్తున్నారన్న అపవాదు మూటగట్టుకున్నారు. పక్కనున్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపనకు బీజం పడటంతో కామారెడ్డికి పాఠశాల మంజూరు ఎప్పుడు తెస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ప్రతిపాదనలు పంపారా..?

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలున్నాయి. అయితే రాష్ట్రప్రభుత్వం సంకల్పించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మాత్రం ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు మంజూరయ్యాయి. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి పాఠశాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపారా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లేక ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం మంజూరు చేయలేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### విద్యార్థుల భవిష్యత్తు పట్టదా

కామారెడ్డి నియోజకవర్గానికి యంగ్ ఇండియా స్కూల్ మంజూరు కాకపోవడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇక్కడి నాయకుల మధ్య ఆధిపత్య పోరు ప్రభావం స్కూల్ మంజూరుపై పడిందన్న ప్రచారం సాగుతోంది. ఐదో తరగతి నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందే పాఠశాలలో వందలాది మంది పేద విద్యార్థులు అవకాశం కోల్పోయారన్న ప్రచారం సాగుతోంది. నాయకులకు విద్యార్థులపై పట్టింపు లేకపోవడమే కారణమని ప్రజలు, విద్యార్థిసంఘాలు మండిపడుతున్నాయి.

### మోతెలో శంకుస్థాపన

కామారెడ్డికి పక్కనే ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని మోతె గ్రామంలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల సముదాయ నిర్మాణం కోసం రూ.200 కోట్లతో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఎంపీ సురేష్ షెట్కార్ పండగ వాతావరణంలో శంకుస్థాపన చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు పుష్కలంగా ఉన్నా నాయకుల మధ్య విభేదాల కారణంగా పాఠశాల మంజూరు కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఇద్దరి మధ్య వివాదాలే కారణం



కామారెడ్డి జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైంది. కామారెడ్డి నియోజకవర్గానికి మాత్రం మంజూరు కాకపోవడానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య ప్రోటోకాల్ వివాదమే కారణం. ఇద్దరు ముఖ్య నాయకులు కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని చెప్పిన మాట నిలబెట్టు కోవాలి. విద్యారంగంలో వెనుకబడిన ఈ ప్రాంతానికి ఇటువంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అవసరమైనప్పటికీ నాయకులు చొరవ చూపకపోవడం బాధాకరం. సమన్వయంతో ముందుకు సాగి పాఠశాల మంజూరు తేవాలి. లేకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

– విఠల్, బివిఎం రాష్ట్ర కార్యదర్శి

### వారంలో స్కూల్ మంజూరు



విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో మూడు నియోజజవర్గాలకు పాఠశాలలు మంజూరు కాగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో శుక్రవారం పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కామారెడ్డికి పాఠశాల మంజూరుపై సీఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కోరాం. వారం రోజుల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు అవుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలందరికీ ఒకే చోట విద్యాబోధన అందనుంది.

– షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు



## సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కన్నుమూత

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మృతిచెందారు. అనారోగ్యం కారణంగా కొన్నిరోజులుగా చికిత్స పొందుతున్న ఆమె శనివారం మృతి చెందారు. కొన్నేళ్లుగా నూర్జహాన్ సీఐటీయూలో కొనసాగారు. ఆమె ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు హక్కుల కోసం నిరంతర పోరాటాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలపై గళమెత్తారు. అయితే కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు.



## నీటికుండీలో చల్లచల్లగా..


ఉమ్మడి జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. మనుషులే కాదు మూగ జీవాలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి మూగజీవాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. నగరంలోని హౌసింగ్ బోర్డులో ఓ శునకం ఇలా నీటి కుండీలో సేదదీరింది.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా ఇండోర్ స్టేడియం నిర్మాణం: షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చేలా కామారెడ్డిలో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియం ఆవరణలో శనివారం ఆయన రూ.8.80 కోట్లతో చేపట్టబోయే స్టేడియం పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రెండేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయన్నారు. స్టేడియంలో 8 ట్రాక్స్ రాకుంటే ఇంటర్నేషనల్ గుర్తింపు రాదని అధికారులు చెప్పడంతో మరింత స్థలం కోసం ప్రయత్నించామని తెలిపారు. పక్కనే ఉన్న స్థలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించినది కావడంతో విద్యాశాఖ చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఏప్రిల్ 4న స్థలం మంజూరవడంతో నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో గిరి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.





## హిందువులను సంఘటితం చేయడానికే ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటు

### సంఘ్ చీఫ్ మోహన్ భగవత్



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లా కందకుర్తిలోని కేశవ స్ఫూర్తి మందిరాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ శనివారం ప్రారంభించారు. అనంతరం మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సందర్శకుల బుక్‌లో సందేశాన్ని రాశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. హెడ్గేవార్ జననం, మరణం నాగ్‌పూర్‌లోనే జరిగిందన్నారు. అయితే ఆయన పూర్వికులు కందకుర్తికి చెందిన వారని చెప్పారు. దీంతో ఇక్కడ స్ఫూర్తి కేంద్రం నిర్మించాలని యోచించామన్నారు. కందకుర్తి ప్రాశస్త్యం తనకు ఈ రోజు తెలిసిందన్నారు.

### హిందూ సమాజాన్ని జాగృతం చేయడానికి..

గరుడ్మంతుడు స్వర్గానికి వెళ్లి అమృతం తెచ్చి తన తల్లిని బానిసత్వం నుంచి విముక్తి చేశారని మోహన్ భగవత్ తెలిపారు. అనంతరం ఆ అమృతాన్ని తిరిగి తీసుకెళ్లి ఇంద్రుడికి ఇచ్చారని చెప్పారు. తన కోసం అమృతం తేలేదని, తల్లిని బానిసత్వం నుంచి విడిపించాడనికి తెచ్చాడని చెప్పారు. హెడ్గేవార్ సైతం తల్లి భారతమాతను దాస్య శృంఖాలల నుంచి విడిపించడానికి ఆర్‌ఎస్‌ఎస్‌ను ఏర్పాటు చేశారన్నారు.

### ఇక్కడి నుంచే..

హిందూ సమాజాన్ని ఆదర్శంగా మార్చడానికి హెడ్గేవార్ సంస్థను ఏర్పాటు చేశారన్నారు. నేడు ఆయన చూపిన మార్గంలో ఎంతోమంది నడుస్తున్నారని చెప్పారు. హెడ్గేవార్‌కు కందకుర్తి నుంచి సేవా భావం, దేశ భక్తి వచ్చాయన్నారు. కందకుర్తిలోని మట్టిలో సైతం హెడ్గేవార్ స్ఫూర్తి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి, రామారావు పటేల్, కందకుర్తి సర్పంచ్ గియాజుద్దీన్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చి నిలబెట్టుకోవడం బీజేపీ నైజం: దినేష్ కులాచారి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మాట ఇచ్చి నిలుపుకోవడం బీజేపీ నైజం అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లింపు విషయమై ధర్పల్లి మండలంలోని వాడి గ్రామంలో పెద్దమ్మ గుడి వద్దకు శనివారం ఉదయం దినేష్ కార్యకర్తలతో చేరుకున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లకుండా తమను పోలీసులు అడ్డగించారని అయినప్పటికీ బైక్‌పై గుడి వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. జిల్లాలో అకాల వర్షాల కారణంగా వందల ఎకరాల్లో పంట నష్టం జరిగితే వెళ్లి బాధితులను పరామర్శించామని చెప్పారు. అయితే దీనిపై స్పందించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తాము ఇప్పటికే పంట నష్ట పరిహారం చెల్లించామని పేర్కొన్నారన్నారు. అయితే ఏ రైతుకు ఎంత పంట నష్టపరిహారం చెల్లించారో ఆధారాలతో చూపించాలని తాము సవాల్ విసిరామని.. పెద్దమ్మగుడికి రావాలని కోరామన్నారు. కానీ ఆధారాలు చూపించలేని ఎమ్మెల్యే ఇక్కడికి రాలేదన్నారు. రైతన్నల కష్టాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ గుడి వద్ద దినేష్ కులాచారిని అరెస్ట్ చేసిన పోలీసులు మోపాల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.




నిజామాబాద్‌లో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్


కామారెడ్డిలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అధికారులు


నిజామాబాద్ టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ..


బీసీ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ..

# మహిళల విద్యాభివృద్ధికి పూలే ఎనలేని కృషి..

పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, సమాజంలో సమానత్వం, విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే మహిళల విద్యకోసం ఎనలేని కృషి చేశారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారని వివరించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్ర


నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో..


జాతీయ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..


బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


కామారెడ్డి టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..


నిజామాబాద్ జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..


రెంజర్లలో సర్పంచ్ లావణ్య భూమేష్ ఆధ్వర్యంలో..


నిజామాబాద్ ఆర్టీసీ కార్యాలయంలో..


పోచంపాడ్ గ్రామపంచాయతీలో..


ఆర్మూర్ పట్టణంలో బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో...


ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో..


నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో..


నగరంలో సీపీఐ ఆధ్వర్యంలో..


మెండోరా పోచంపాడ్ గ్రామపంచాయతీలో..


ఆర్మూర్‌లోని సీపీఐ కార్యాలయంలో..


ఆలూర్ గ్రామంలో..


ఆలూరు మండలం మచ్చర్ల లో..


కొత్తపల్లి ఎస్సీ కాలనీలో..


ముప్కాల్ మండల కేంద్రంలో..

## నీటి సమస్య పరిష్కారం



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని తాడ్కోల్ గ్రామంలోని రాజారాం దుబ్బలో కొంతకాలంగా నెలకొన్న నీటి సమస్యను గ్రామ పంచాయతీ అధికారులు పరిష్కరించారు. నీటి కొరత తీవ్రంగా ఉండడంతో, తక్షణ చర్యగా సింగిల్ మోటార్‌ను ఏర్పాటు చేసి శనివారం నుంచి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారాం దుబ్బ ప్రాంత ప్రజలకు ఇకపై నీటి ఇబ్బందులు లేకుండా సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ అందే రమేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాజిద్, వార్డు సభ్యులు సతీష్ రెడ్డి, ఆమేర్, కాలనీ వాసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్ పల్లి శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే శనివారం డబుల్ ఇళ్ల నూతన కమిటీని లబ్ధిదారులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోకల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా షేక్ షాదుల్లా, రామగుల్ల శంకర్, కట్కూరి రామకృష్ణ, ఎర్రోళ్ల మారుతి, ఉపాధ్యక్షులుగా సంగి శ్యామ్, తోకల అనిల్ కుమార్, సింగల్ వార్ బాలాజీ, గూడెపు బాల్ నర్సు, కోశాధికారులుగా గంజి దామోదర్, శ్యామ్, సలహాదారులుగా బోదాస్ పెద్ద రాజయ్య, తెడ్డురవి, వడ్ల లక్ష్మయ్య, మంగళ కిషన్, లింగం, షేక్ అహ్మద్, ఈశ్వర్, పాషా, మోచకిరణ్, చంద్రంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు తోకల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షేక్ షాదుల్లా మాట్లాడుతూ.. తమ మీద నమ్మకంతో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రామేశ్వరపల్లి డబుల్ బెడ్ రూమ్ వార్డు సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియ జేశారు. డబల్ బెడ్ రూమ్ వార్డు సభ్యులకు ఏ సమస్య వచ్చినా తమ వంతు బాధ్యతగా పనిచేస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

**అక్షరటుడే, భిక్కనూరు:** ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా ఇటీవల ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనను కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు మొగిలిపల్లి భూమేష్ గుప్తా, శెనిశెట్టి గౌరీశంకర్, కంచర లింగం, శెనిశెట్టి శ్రీనివాస్, కొండ బైరయ్య, గోవింద్ భాస్కర్, వలపిశెట్టి లక్ష్మీరాజం, అతిమాముల రమేష్, గజవాడ నాగరాజు, దానరపు రాజలింగం, ఉప్పల హరిధర్, ముప్పారపు ఆనంద్, వలపిశెట్టి భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్త పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే



**అక్షరటుడే, లింగంపేట :** మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాయకోటి సత్యనారాయణ శనివారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యేకు జాజాల సురేందర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆయన మృతి చెందడంతో జాజాల ఆదివారం శెట్‌పల్లి చేరుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి కార్యకర్త పాడె మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యనారాయణ ఎంతో క్రియాశీలకంగా తన వెంట ఉండి పార్టీ కోసం విలువలు గల రాజకీయం చేసినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ముద్దాం సాయిలు, మాజీ జెడ్పీ సభ్యుడు సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రూప్‌సింగ్, గన్ను, నాయక్, యూసఫ్, పరువయ్య తదితరులు ఉన్నారు.

## వెల్మల్‌లో చలివేంద్రం ప్రారంభం..

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో సర్పంచ్ గుజ్జి దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో దూరప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులకు సౌకర్యార్థం చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.




కోటగిరిలో..

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..


జిల్లాలో వరికోతలు జోరందుకున్నాయి. కొన్నిప్రాంతాల్లో కోతలు ముగిశాయి. అలాగే అకాల వర్షా లు కురుస్తుండడంతో రైతులు సైతం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో వెల్మల్, కోటగిరి, బాల్కొండ ప్రాంతాల్లో వరికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. – అక్షరటుడే, ఆర్మూర్/కోటగిరి/బాల్కొండ


బాల్కొండలో..


వెల్మల్‌లో..

# అంబులెన్సును ఢీకొన్న ప్రైవేట్ బస్సు.. డ్రైవర్, పేషెంట్ దుర్మరణం

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆస్పత్రిలో కోలుకున్నా మృత్యువు ఆమెను వీడలేదు. ప్రైవేట్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. తెల్లవారితే ఇంటికి చేరుకునే మధ్యలోనే అనంత లోకాలకు చేరుకుంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న అంబులెన్సును కాశీకి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో అంబులెన్స్ డ్రైవర్, పేషంట్ మృతి చెందిన ఘటన భిక్కనూరు రామేశ్వర్ పల్లి జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ కు చెందిన షైపుల్లా ఖాన్ తన భార్య సలెహా భానును హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఓ ప్రైవేట్ అంబులెన్సులో ఆదిలాబాద్ కు అర్ధరాత్రి సుమారు 12:30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో అంబులెన్స్ బిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లి జాతీయ రహదారి వద్దకు రాగానే వెనక నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సు అంబులెన్సును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో అంబులెన్సులో ఉన్న పేషంట్ సలేహా భాను(60), డ్రైవర్ షేక్ సర్దార్(35) అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి భర్త షైపుల్లా ఖాన్ కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న



భిక్కనూరు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను పక్కకు తప్పించారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకుని మృతదేహాలతో పాటు గాయపడిన వ్యక్తి ని జీజీహెచ్ కు తరలించారు. బస్సు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.